పత్తి సాగుకు రైతులు సన్నద్ధం

- పెరిగిన ఎరువుల ధరలు

ఫిరంగిపురం: అదునుకు వర్షాలు పడకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం చేసేందుకు గానూ విత్తనాలు నాటుకునే సమయంలో సరైన వర్షాలు పడకపోవడంతో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం కాలేదు. కాగా రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కర్షకులు పత్తి విత్తనాలను ప్రస్తుతం నాటుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడు వర్షాలు పడక నెల రోజులు ఆలస్యంగా పత్తి విత్తనాలు నాటుతున్నారు.

పెరిగిన పత్తిపంట విస్తీర్ణం..

మండలంలో మొత్తం 16 వేల ఎకరాల భూమి ఉంది. దానిలో ఈ ఏడాది సుమారు 11 వేల ఎకరాల్లో పత్తి పంట వేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అడపాదడపా కురిసిన వర్షంతో రెండు రోజులుగా పత్తి విత్తనాలను కూలీలతో నాటిస్తున్నారు. ఇప్పటికే 200 ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటినట్లు రైతులు చెబుతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

గతేడాదితో పోలిస్తే ఈ యేడు వ్యవసాయం చేసేందుకు పెట్టుబడి పెరిగినట్లు రైతులు అంటున్నారు. భూమిని నాగళ్లతో దున్ని, గొర్రులాగించి, అచ్చుతోలించినందుకు సరాసరి ఎకరానికి సుమారు రూ.5 వేలు ఖర్చు అవుతుంది. ఎకరానికి రెండు ప్యాకెట్ల పత్తి విత్తనాలు సుమారు రూ.1700 వరకు ఉన్నాయి. పత్తి విత్తనాలు నాటేందుకు వ్యవసాయ కూలీలకు కాంట్రాక్టు పద్ధతిలో సుమారు ఎకరానికి రూ.2 వేలు ఇవ్వాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాలను బట్టి ఎకరానికి కౌలు రూ.16 వేల నుంచి రూ.23 వేల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొన్ని సార్లు ముందు కౌలు ఇవ్వాల్సి వస్తుంది.



పత్తి విత్తనాలు నాటుతున్న కూలిలు

ఆలస్యంగా విత్తనాలు..

గడిచిన సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం నెల రోజులు ఆలస్యంగా పత్తి విత్తనాలు నాటాల్సి వస్తోంది. దీని ద్వారా పంట దిగుబడి తగ్గి, గులాబీ రంగు పురుగు బెడదతో పుచ్చు వచ్చే అవకాశం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. ఎరువులు, పురుగు మందుల రేట్లు కూడా పెరిగిపోవడంతో ఎకరానికి పెట్టుబడి పెరుగుతుందని చెబుతున్నారు. పత్తి పంట గతేడాది దిగుబడి బానే వచ్చినా సరైన ధర లేక పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. సుమారు ఎకరానికి 3 దఫాలుగా వచ్చిన పంటకు మొదటి విడతగా క్వింటా రేటు రూ.5 వేలు ఉండగా.. రెండోసారి క్వింటా సీసీఐ ద్వారా రూ.7 వేలు ఉంది. మూడో విడత పూర్తిగా తగ్గి రూ.4 వేలకు పడిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది ఆలస్యంగా నాట్లు వేస్తుండటంతో పంట దిగుబడి వస్తుందా లేక వచ్చిన పంటకు సరైన విలువ లభిస్తుందో లేదోనని రైతులు అంటున్నారు.

పెరిగిన కూలి రేట్లు..

ఆరు ఎకరాల్లో పత్తిపంట వేసాను. గతేడాదితో పోలిస్తే ఈ యేడు కూలిల రేట్లు పెరిగాయి. గత సంవత్సరం పంట దిగుబడి వచ్చినా సరైన గిట్టుబాటు లేక పెట్టుబడి మాత్రమే వచ్చింది. ఈ ఏడాది ఎలా ఉంటుందో చూడాలి.



– ఆరె శివరామిరెడ్డి, రేపూడి

ఎరువుల ధర తగ్గించాలి..

ఈ ఏడాది నెల రోజులు ఆలస్యంగా పత్తి విత్తనాలు నాటుతుండటంతో దిగుబడి తగ్గుతుందోనని భావించాల్సి వస్తుంది. అంతేకాక ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగటంతో పెట్టుబడి పెరిగింది. ప్రభుత్వం ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించేలా చూడాలి.



– చూపూరి రామమోహన్‌రెడ్డి, 113.తాళ్లూరు

క్లుప్తంగా

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారానికి 229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. ఏసీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, కార్మికులు నవనీతం, దానయ్య, గురవయ్య, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



మంగళగిరి టౌన్: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్‌లకు మంగళగిరి నగరంలోని వివిధ జమాత్‌లకు చెందిన ముస్లిం ప్రతినిధులు ఆదివారం వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబర్‌స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామని, నగరంలో 20 ఏళ్లుగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతిపాదనపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని వివరించినట్లు తెలిపారు. ఈ ఖబర్‌స్థాన్ వక్ఫ్ బోర్డు నోటిపై చేసిన స్థలం కావడంతో దీని పరరక్షణ కూడా వక్ఫ్‌బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వినతిపత్రంలో కోరామని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం



మంగళగిరి టౌన్: ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె ఆదివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సీఐటీయూ నాయకులు చెంగయ్య, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కోటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కార్మికులకు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కేదారనాథ్, కె.శ్రీనివాసరావు, కె.గోపి, వి.శ్రీనివాసరావు, ప్రకాష్, సాంబశివరావు, రమణయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చిన కాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హైదరాబాద్ ఏషియన్ వ్యాస్కులర్ హాస్పటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీ సుసిరాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.మాధవి లత, దంత వైద్య నిపుణులు డాక్టర్ జీవన, వ్యాస్కులర్ అండ్ ఎండో వ్యాస్కులర్ వైద్య నిపుణులు డాక్టర్ జీవీ ప్రమోద వైద్య సేవలను అందించారని పేర్కొన్నారు. ఎస్ఆర్ఐ కార్డియాలజీ విభాగం మెడికల్ విద్యార్థులు, నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు రోగులకు సేవలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయికృష్ణ, భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, ఆధ్యాత్మిక ప్రతినిధి ఆర్టీసీ ప్రసాద్, మహిళా విభాగం ప్రతినిధులు రాధిక, లక్ష్మి శ్యామల, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు బోనాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కొలువైన గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాటిబండ్ల నారాయణరావు మాట్లాడుతూ.. శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కారసనేని అంకినేయుడు, లక్ష్మీ పార్వతి, పాటిబండ్ల నారాయణరావు, గాయత్రీదేవి, వెంకట సాంబ శివ ప్రసాదరావు, నాగరాజ కుమారి, మొవ్వ నాగేశ్వరరావు, జె.శివ, పి.గాయత్రీదేవి, కసారినేని సుస్మ, కసుకుర్తి లింగేశ్వరరావు, కసుకుర్తి జయలక్ష్మి, మేడికొండ ఉమామహేశ్వరరావు, నాగ శిరోణి, పరుచూరి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.



8వ రోజుకు కార్మికుల సమ్మె

తాడేపల్లి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి 8వ రోజుకు చేరుకుంది. ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో కార్మికులు చేస్తున్న సమ్మెకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ రాజధాని ప్రాంత గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా జీతాలను పెంచాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎర్రబాలెం అధ్యక్షులు లేళ్ల శివ, నాయకులు షేక్ బడే మియా, దానబోయిన నాగయ్య, ఆకుల శంకర్, షేక్ షఫీ, దాసరి ప్రియానందం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.బాబూరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆదివారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెను, సహేతుకమైన వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకట్ రెడ్డి, మేస్త్రి శ్రీనివాసరావు, కార్మికులు డేవిడ్, మరియమ్మ, సంతోషం, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

రిజర్వేషన్ చట్టంపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి

మంగళగిరి టౌన్: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ చట్టంపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం సోషలిస్ట్ కూటమి, ప్రజా సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రైవేటు రంగంలో సమాన అవకాశం చట్టం రావాలన్నారు. సాధారణ చట్టంలో భాగంగా సమాన ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీలు, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చర్చకు తెరలేపాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి జై.బాబు, సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కార్యదర్శి వీరాస్వామి, జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు ఆకాష్, సంతోష్, రత్నం తదితర నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

• రహదారులా.. తటాకాలా!!



ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి వెళ్లే మూల మలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలపై వచ్చే వారు గుంతలో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. వర్షం పడిన సమయంలో గుంత నిండా నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తటాకాలుగా దర్శనమిస్తున్న గుంతను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – ఫిరంగిపురం

బాబు రెండు రకాలుగా మోసం చేశాడు

- 2024 ఎన్నికల ముందు మరో ల్యాండ్ పూలింగ్ ఉందని బాబుకు తెలియదా
- రాజధానిని అద్భుతంగా తీర్చిదిద్దుతానని నాడు చెప్పి.. ఇప్పుడు సమీకరణ అంటూ రైతులను మోసం చేస్తున్న టీడీపీ
- వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ఇటు రాజధాని పేరుతో భూములిచ్చిన రైతులను, అటు సూపర్ సిక్స్ పేరుతో ఓట్లేసిన ప్రజలను బాబు నిలువునా మోసం చేశాడని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు మండిపడ్డారు. ఆదివారం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఎన్నికలకు ముందు రాజధానిని అద్భుతంగా తీర్చిదిద్దుతానని చెప్పిన బాబు ఇప్పుడు మళ్లీ రెండో విడత భూసమీకరణ అంటూ మోసం చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. 2024 ఎన్నికలకు ముందు మరో మారు ల్యాండ్ పూలింగ్‌కి వెళ్లాలి అని చంద్రబాబుకు తెలియదా.. లేక తెలిసే మోసం చేస్తున్నారా అని ప్రశ్నించారు. బాబును నమ్మి మోసపోయిన రైతులందరికీ వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. రానున్న రోజుల్లో మీ మీ గ్రామ అధ్యక్షులను తీసుకుని గ్రామాల్లో పర్యటిస్తానని.. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై ఇంటింటికీ తిరిగి బాబు చేసిన మోసాలు, ఎన్నికల మేనిఫెస్టో సాక్షిగా ఇచ్చిన తప్పుడు హామీలపై ప్రజలకు తెలియజేద్దామన్నారు. ప్రజలకు బాబు మోసాలను తెలియజేసే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించి కూటమి ప్రభుత్వం మోసాలను ఎండగట్టాలని తెలిపారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొయ్యగూర వినోద్, గ్రామ పార్టీ అధ్యక్షులు కంతేటి చిన్న వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు ఐనవోలు సుధీర్, మండల యువజన, ఎస్సీ, విద్యార్థి విభాగం అధ్యక్షులు బెజ్జం రాంబాబు, కోలేటి అనిల్, మేకల రవీంద్ర ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు దానం వినోద్, మండల కార్యదర్శి మెండెం శేషగిరి, నాయుడు నాగేశ్వరరావు, వివిధ విభాగాల నాయకులు మాతంగి చెన్నకేశవ, కంతేటి అశోక్, నేలపాటి నాగేంద్ర, కాకర్ల నాగేశ్వరరావు, నంబూరు రఘునాథరావు, భుల్ల కృష్ణ, పుట్టి సుబ్బారావు, వనమా భాను పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుళ్లూరు మండల నాయకులు, కార్యకర్తలు

బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ సమావేశం నేడు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదురు గల తమ్మా ఎన్‌క్లేవ్ ఫంక్షన్‌హాలులో సోమవారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రచార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డిలు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్‌బాబు) హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య నాయకులు, నియోజకవర్గ సెల్ అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

ప్రమాణ స్వీకార ర్యాలీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డ్ వరకు ఆదివారం టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ దుబాయ్ మస్తాన్, దారా దాసు, దానబోయిన సుందరరావు యాదవ్, ఇట్టా భాస్కర్, అన్నెం కుసుమ, కాటాబత్తుని నిర్మల సాగర్, ఇట్టా పెంచలయ్య, టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను గాలికొదిలిన కూటమి ప్రభుత్వం

తాడేపల్లి రూరల్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట మార్చడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో స్థానిక నాయకులతో కలిసి బాబు మేనిఫెస్టో రీకాలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు ఇచ్చిన హామీలపై ప్రజలను ఏ విధంగా మోసం చేసారనే వివరాలను ప్రజల సెల్‌ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ చూపించి వారికి వివరించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ ఇస్తానని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా హామీల అమలుని గాలికి వదిలేశారని మండిపడ్డారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమల్ల స్నేహసంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, పార్టీ సీనియర్ నాయకులు ఇసుకపల్లి బాలస్వామి (బుగ్గయ్య), రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

దుగ్గిరాల: ఈ యేడు వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతలైన గంగానమ్మ తల్లి, గోగులమ్మతల్లికి ఆదివారం ఈమని గ్రామంలో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు మేళతాలాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ధరణికోట సాంబయ్య పూజలు నిర్వహించగా ఏర్పాట్లను మాజీ యార్డు డైరెక్టర్ కుప్పాల శ్రీరాంమూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో యలమందయ్య, నర్సయ్య, కె.కోటేశ్వరరావు, యడ్ల సాయికృష్ణ పాల్గొన్నారు.

గో సంరక్షణకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని గోసేవ పథకానికి గుంటూరుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. తాడేపల్లికి చెందిన జి.రంగలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయ ఈవో శీనానాయక్‌ను కలిసి గోసంరక్షణ నిధికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు.

భూములిచ్చే రైతులకు న్యాయం చేయాలి

తాడికొండ: అమరావతికి అదనపు భూ సమీకరణ పేరుతో ముందుకొస్తున్న కూటమి ప్రభుత్వం రైతులకు ఎకరానికి ఇచ్చే 1,250 గజాలతో పాటు రూ.1 కోటి పరిహారం అందించాలని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అదనపు భూ సమీకరణ పేరుతో చేస్తున్న విధానం వ్యతిరేకిస్తూ తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఆయన చేస్తున్న రిలే నిరసన దీక్షలు ఆదివారంతో 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్ల క్రితం భూములు తీసుకున్న రైతులే నేడు ఏ సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతుంటే వారికి ఏం న్యాయం చేయకుండా మరో లక్ష ఎకరాల సమీకరణ దిశగా ప్రభుత్వం ముందుకెళ్లడం అన్యాయం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. కార్యక్రమానికి మద్దత్తుగా సీపీఎం మండల అధ్యక్షుడు చింతల భాస్కరరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు

హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో శ్రమదానం

తాడేపల్లి రూరల్: సీతానగరం బోటు యార్డ్ దగ్గర నుంచి హైస్కూల్‌కు వెళ్లే మార్గం పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయింది. దీంతో ఆదివారం స్థానికులు, విద్యార్థినీ విద్యార్థులు శ్రమదానం చేసి దారిని శుభ్రం చేశారు. పాఠశాలకు వెళ్లి రావడానికి ఇబ్బంది కరంగా ఉండడంతో స్థానికుల సహకారంతో విద్యార్థులు శ్రమదానం చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మేరి, కొండలు, పల్లవి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమర్రు, మేడికొండూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వస్తున్నారు. నిడమర్రు రోడ్డులో ఇద్దరి ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఇరువురూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు.

ప్రజల్ని చైతన్యం పరిచేందుకు ప్రజా నాట్యమండలి కృషి

మంగళగిరి టౌన్: సమాజంలోని సమస్యలకు పరిష్కారాలను చూపడానికి అనేక కొత్త కళారూపాలు సృష్టించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రజా నాట్యమండలి కృషి చేస్తోందని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం కళాకారులు కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. మనుషుల మధ్య సామరస్యతా భావాన్ని పెంపొందించడానికి కళాకారులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, కళాకారులు లూథర్ పాల్, సుమ, రాజ్యలక్ష్మి, రాఘవయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.



కళారూపాలు ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు